క్లుప్తంగా

అదనపులోడు క్రమబద్ధీకరించండి


బల్లికురవలో మాట్లాడుతున్న ఈఈ

బల్లికురవ: గృహవినియోదారులు అదనపు లోడును రాయితీపై జూన్ 30వ తేదీ లోపు క్రమబద్ధీకరించు కోవాలని ఆశాఖ ఈఈ ఎస్. మస్తాన్‌రావు కోరారు. శుక్రవారం బల్లికురవలో 34 బృందాలు గ్రామాల వారీగా విస్తృత తనిఖీలు చేపట్టారు. స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈఈ మాట్లాడుతూ అక్రమ విద్యుత్ వాడకం, అదనపులోడు వినియోగం చట్టరీత్యా నేరమన్నారు. అదనపు లోడుకు 50 శాతం రాయితీపై కిలోవాట్‌కు వెయ్యి రూపాయలు చెల్లిస్తే వినియోగదారులు అధిక లోడు వినియోగించు కోవచ్చని వివరించారు. సమావేశంలో డీఈ సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

బీటీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు

అద్దంకి: విత్తన దుకాణాల్లో బీటీ పత్తి విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర స్థాయి తనిఖీ బృందం అధికారి డాక్టర్ బాలభాస్కర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని నాలుగు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. హెర్బిసైడ్‌ట్రీట్ సంబంధించిన పత్తి విత్తనాలు తనిఖీ చేయగా స్టాకు లేకపోవడంతో నెగిటివ్‌గా తేలింది. ఈ సందర్భంగా బాలభాస్కర్ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనే సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. వ్యవసాయ సంచాలకుడు డి. బాలాజీ మాట్లాడుతూ రైతులు అమ్మకాల సమయంలో రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మేదరమెట్ల: కొరిశపాడు మండల పరిధిలోని పమిడిపాడు, కొరిశపాడు, మేదరమెట్ల, రావినూతల, సోమవరప్పాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈమేరకు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రయాణం.. ప్రమాదం

కారంచేడు: గ్రామీణ ప్రాంత రహదారులను సుందరంగా తీర్చిదిద్దుతామని.. గ్రామీణ రహదారులకు కూటమి ప్రభుత్వంలో మోక్షం అని ప్రగల్భాలు పలుకుతున్న పాలకులకు, అధికారులకు ఈ రహదారి దుస్థితి కనిపించడం లేదా అని ప్రయాణికులు వాపోతున్నారు. మండలంలోని స్వర్ణ నుంచి దగ్గుబాడు వెళ్ళే ప్రధాన రహదారి గత ఏడాదిలో రోడ్డు నిర్మాణం కోసం తవ్వి పనులు చేపట్టారు. ఈ లోగా ప్రభుత్వం మారడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. అప్పటి నుంచి ఈ రహదారి పనులకు మాత్రం మోక్షం కలగడం లేదని ఈ రహదారిలో ప్రయాణించే వాహనదారులు వాపోతున్నారు. చీరాల నుంచి స్వర్ణ మీదుగా ఇంకొల్లు ప్రయాణించాలన్నా, మండల కేంద్రమైన కారంచేడు నుంచి స్వర్ణ మీదుగా తిమిడెదపాడు, పూసపాడు, వంకాయలపాడు గ్రామాలకు వెళ్ళాలన్నా


స్వర్ణ–దగ్గుబాడు రోడ్డులో కారు వెళ్తుంటే దుమ్ములేచి ప్రమాదకరంగా కనిపిస్తున్న రహదారి

వాహనదారులు ఈ రోడ్డునే వినియోగిస్తారు. రోడ్డుపై రాళ్లు లేచి ఉండటంతో ద్విచక్రవాహనాలు, ఆటో టైర్లకు పంచర్లు కూడా అవుతున్నాయని, రాత్రి సమయాల్లో వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇక లారీలు, ట్రాక్టర్లు, కార్లు తిరిగే సమయంలో దుమ్ములేచి ద్విచక్ర వాహదారులకు నరకం కనిపిస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి స్వర్ణ–పోతినవారిపాలెం–దగ్గుబాడు గ్రామాలకు చెందిన ఈ రహదారిని త్వరగా పూర్తి చేయాలని, వాహనదారులు వేడుకుంటున్నారు.

అక్రమ సస్పెన్షన్లు నిలుపుదల చేయాలి


బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

చీరాల అర్బన్: అక్రమ సస్పెన్షన్, తొలగింపులను నిలుపుదల చేయాలని ఎన్‌ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద రెండోరోజు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ 1/19 సర్క్యులర్ యథావిధిగా అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, మెరుగైన ఈహెచ్‌ఎస్ విధానాన్ని అమలు చేయాలని, మెడికల్ లీవ్ కమిటేషన్ ఇచ్చి ప్రతి నెలా జీతం ఇవ్వాలని, గ్యారేజీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాంధీ హాజరై మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీకి ఇచ్చిన వినతిపత్రంలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా నిలిచిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. డిపో అధ్యక్షుడు పి.రవి, కార్యదర్శి పి.దయాబాబు, డిపో సీసీఎస్ డెలిగేట్ డి.ప్రవీణ్‌కుమార్, నాయకులు, డిపో కమిటీ సభ్యులు హాజరయ్యారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

చీరాల టౌన్: పంచాయతీల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ శివసుబ్రమణ్యం సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు గ్రామస్తులకు సూచించారు. శుక్రవారం రామకృష్ణాపురం గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బుట్టలను అందించాలన్నారు.

వైభవోపేతంగా బొగ్గులకొండ తిరునాళ్ల

బల్లికురవ: మండలంలోని కూకట్లపల్లి గ్రామ సమీపంలోని బొగ్గుల కొండ వద్ద వేంచేసి ఉన్న యోగ ప్రసన్నాంజనేయస్వామి 48వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం వైభవంగా ముగిసింది. అర్చకులు ప్రసాద్ శర్మచే ఉదయం 5 గంటల నుంచే స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, తమలపాకులతో అర్చన, వనమాలతో ప్రత్యేకంగా అలంకరణ చేట్టారు. కూకట్లపల్లి పరిసర గ్రామాల్లోని భక్తులు స్వామివారి సన్నిధికి చేరి పొంగళ్లు పెట్టి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ, గ్రామస్తుల సహకారంతో అన్నసంతర్పణ చేపట్టారు. అనేక మొక్కుబడి ప్రభలు స్వామివారి సన్నిధినికి చేరాయి. భారీ ఎలక్ట్రిక్ ప్రభ మ్యూజికల్ నైట్, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.


అలంకరణలో బొగ్గుల కొండ ప్రసన్నాంజనేయస్వామి


ప్రత్యేకంగా అలంకరించిన దర్గా

ఘనంగా ఉరుసు మహోత్సవం

మార్టూరు: మార్టూరులోని కొణిదెన రోడ్డులో గల హజరత్ కరిముల్లా షావలి దర్గా 49వ ఉరుసు ఉత్సవ కార్యక్రమం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో గన్నవరం సెంటర్, కొణిదెన సెంటర్‌తో పాటు దర్గాను ప్రత్యేక ఎలక్ట్రికల్ లైటింగ్‌తో చేసిన ఏర్పాట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పల్నాడు, బాపట్ల, ప్రకాశం తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించి ముడుపులు చెల్లించుకున్నారు. గన్నవరం రోడ్డులోని స్థానిక పీర్ల చావిడి వద్ద నుంచి ప్రత్యేకంగా అలంకరించిన గుర్రంతో గంధాన్ని గ్రామంలోని వీధుల వెంట ఊరేగింపు నిర్వహించి మత పెద్దల ప్రత్యేక ప్రార్థనల మధ్య దర్గా వద్దకు చేర్చారు. పోలీసులు ట్రాఫిక్ను క్రమబద్ధీకరించారు.


మార్టూరు దర్గాలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం చైత్ర మాసం హస్త నక్షత్రం పౌర్ణమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

నలుగురురికి బీసీ కార్పొరేన్ రుణాలు

అద్దంకి: మహాత్మా జ్యోతీరావు పూలే జయంతిని సందర్భంగా శుక్రవారం ఎంపీడీఓ సింగయ్య నలుగురు లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ రుణాల ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఫోర్ సర్వే ఆధారంగా 3462 బంగారు కుటుంబాలున్నట్లు తెలిపారు. మొత్తం కుటుంబాలు 14,105 అని తెలిపారు. అధిక శాతం బంగారుకుటుంబాలున్న గ్రామం మోదేపల్లి, ధేనువకొండ అని సర్వే ద్వారా తెలిసినట్లు తెలిపారు.


చీరాల: పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఒన్‌టౌన్ సీఐ సుబ్బారావు


యద్దనపూడిలో నివాళులర్పిస్తున్న తహసీల్దారు కార్యాలయ సిబ్బంది


చిన అంబడిపూడిలో..

● ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు

పూలే స్ఫూర్తి అనుసరణీయం

చీరాల: పీడిత వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలు అజరామరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 198 జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని పూలే విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ, సిబ్బంది జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అలానే తహసీల్దార్ గోపీకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు గడియార స్తంభం సెంటర్‌లో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సాదు రాఘవ, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముప్వల వెంకటరమణారావు, జిల్లా కార్యదర్శి కాకర్ల వెంకటేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ అరవపల్లి కుమార్, పట్టణ అధ్యక్షురాలు జి.భవాని, ఎం.సుజాత, మేడికొండ భరణీరావు, కాకుమాను సుబ్బారావు, ఎస్సీ మోర్చా నాయకులు తడవర్తి చంద్రశేఖరరావు, శవనం రామస్వామి రెడ్డి, బ్రహ్మయ్య, ముప్వల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. చీరాల ఒన్‌టౌన్ సీఐ సూరేపల్లి సుబ్బారావు, సిబ్బంది నివాళులర్పించారు.

కారంచేడు: అణగారిన వర్గాల ప్రజలకు ఆశాజ్యోతిగా మహాత్మా జ్యోతీరావు పూలే చరిత్రలో నిలచిపోతరాని తహసీల్దార జి. నాగరాజు అన్నారు. శుక్రవారం కారంచేడు రెవెన్యూ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. డీటీ అనిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జగదీష్, మండల సర్వేయర్ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

అద్దంకి: బంగ్లా రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహనీయుడు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేశ్ బాబు మాట్లాడుతూ పూలే సమజాంలోని అంటరానితనం, వితంతువివాహాలు, లింగ వివక్ష వంటి సమాజ రుగ్మతలకు వ్యతిరేకంగా పోడాడరని గుర్తు చేశారు. మన్నం త్రిమూర్తులు, విద్వాన్ జ్యోతీ చద్రమౌళి తాళ్లూరి బాబూరావు, పీసీహెచ్ కోటయ్య పల్గొన్నారు.

యద్దనపూడి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా తహసీల్దార్ కాకి రవికుమార్ నివాళులర్పించారు. సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని ఆయన స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాలు ముందుకు సాగాలని సూచించారు. డీటీ మస్తాన్‌రావు, విష్ణు, భాస్కర్‌రావు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక తత్వవేత్త, సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావుపూలే, ఆయన భార్య సావిత్రిభాయి పూలే త్యాగాలను నేటి యువత మరువరాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తిపాటి నాగయ్య మాదిగ అన్నారు. చిన అంబడిపూడి, ప్రాథమి పాఠశాల వద్ద గల ఇరువురి కాంస్య విగ్రహాలకు నివాళులర్పించారు. సురభి రామారావు, ప్రభాకర్, పార్థసారధి పాల్గొన్నారు.

జె.పంగులూరు: ఎంపీడీఓ స్వరూపారాణి ఆధ్వర్యంలో జ్యోతిరావు పులే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పూలే గొప్ప సంఘసంస్కర్త అని.. దేశంలోని అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారన్నారు.

మేదరమెట్ల: అణగారికి వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావ్ పూలే అని నియోజకవర్గం ఎంఆర్‌పీఎస్ నేత తేళ్ల శ్రీనివాసరావు అన్నారు. మేదరమెట్లలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. గడ్డం ఏసుబాబు, అప్పికట్ల రవి బాబు ఉన్నారు.

చీరాల రూరల్: బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గడియార స్తంభం సెంటర్లోని పూలే విగ్రహానికి నివాళులర్పించారు. పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్ మాట్లాడుతూ విద్య అనే ఆయుధం ద్వారా సమాజంలోని మూఢ విశ్వాసాలను తొలగించవచ్చుననే ఆలోచనతో తన భార్యతో ప్రజలకు చదువు చెప్పించి చీకటి ప్రపంచానికి వెలుగులు నింపిన మహనీయుడని పేర్కొన్నారు. బీఎస్పీ ఇన్‌చార్జ్ కాటి మార్క్, దుడ్డు భాస్కరరావు, బుర్ల సాంబశివరావు, సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు అన్నారు. ఇంకొల్లులో పూలే విగ్రహానికి నివాళులర్పించారు. గడ్డం హనుమంతరావు, తన్నీరు సూరిబాబు, తలకాయల కోటేశ్వరరావు, వై. రమేష్, కాకి అశోక్, కాకి కరుణాకర్, సంతరావూరి అశోక్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


అద్దంకి: చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సంఘ నాయకులు


మేదరమెట్లలో నివాళులర్పిస్తున్న దృశ్యం


ఇంకొల్లు: జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


జె.పంగులూరు: జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ



చీరాల: మహాత్మ జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు


చీరాల: మున్సిపల్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు

వక్ఫ్ సవరణ బిల్లు అన్యాయం



దగ్గుబాడులో నినాదాలు చేస్తున్న ముస్లింలు

దగ్గుబాడు (కారంచేడు): కేంద్ర ప్రభుత్వం దేశంలో వక్ఫ్ బోర్డు సవరకు బిల్లును ఆమోదించడం వెనుక అనేక కుట్రలు దాగి ఉన్నాయని ముస్లిం మత పెద్దలన్నారు. శుక్రవారం మండలంలోని దగ్గుబాడులో రెండు మసీదుల ఇమాంల ఆధ్వర్యంలో ముత్తవలీలు షేక్ హుస్సేన్‌వలీ, సయ్యద్ యాకూబ్‌ల నేతృత్వంలోని రోడ్డుపై బైఠాయించారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా పాత మద్రాసు రోడ్డులోని పర్చూరు–ఇంకొల్లు రోడ్డులో దగ్గుబాడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నినాదాలు చేశారు. గతంలో దేశంలో రూ. 65లక్షల కోట్లు అప్పులు ఉంటే బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత దానిని రూ. 285లక్షల కోట్లకు తీసుకెళ్లిందన్నారు. దేశ అభివృద్ధికి ప్రజల నుంచి వస్తున్న నిధులను ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అది చాలదన్నట్లు వేల సంవత్సరాల క్రితం నుంచి ఉన్న భూములను వక్ఫ్ చట్టం ద్వారా స్వాధీనపర్చుకొని అమ్ముకోవాలని చూస్తోందని వాపోయారు. ముస్లిం పెద్దలు ముల్లా మక్బుల్, ముల్లా ముస్తఫా, ముల్లా నూర్‌అహ్మద్, పఠాన్ మహబూబ్‌ఖాన్, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు పఠాన్ మహబూబ్‌ఖాన్, ముల్లా బాజీ, సయ్యద్ లాల్‌జాన్, సయ్యద్ మంజిల్, సయ్యద్ హమ్రుద్దీన్, సయ్యద్ అహ్మద్, పఠాన్ కాలేషావలీ, ముల్లా జిలానీ, సయ్యద్ కరీముల్లా, స్థానిక ముస్లింలు పాల్గొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు క్రమబద్ధీకరించారు.

విత్తన దుకాణాల్లో అధికారుల తనిఖీలు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులోని విత్తన దుకాణాలను రాష్ట్ర స్థాయి అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బాల భాస్కర్ ఏడీ జి. మోహన్ ఆధ్వర్యంలో మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు ఏవో అంజిరెడ్డి, అద్దంకి ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పలు కంపెనీల విత్తనాలను పరీక్షించారు.